క్లుప్తంగా

రంగు మారిన తీరం



బురద రంగులో తీరం

బీచ్ రోడ్డు: నీలం రంగులో ఉండాల్సిన సాగర తీరం అకస్మాత్తుగా బురద రంగులోకి వచ్చింది. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా కురుస్తున్న వర్షాలకు బురదనీరు సముద్రంలో కలవడంతో రంగు మారింది.

లీకైన భూగర్భ డ్రైనేజీ



పిఠాపురంకాలనీలో లీకవుతున్న భూగర్భ డ్రైనేజీ

మద్దిలపాలెం : జీవీఎంసీ 22వ వార్డు పిఠాపురం కాలనీలో కళాభారతికి ఎదురుగా ఉన్న వీధిలో భూగర్భ డ్రైనేజీ లీకవుతోంది. దీంతో దుర్వాసన భరించలేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. లీకేజీ సమస్యను పరిష్కరించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రాజీవ్‌గాంధీకి ఘన నివాళి



రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

బీచ్ రోడ్డు: దివంగత మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి సందర్భంగా మంగళవారం బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహం వద్ద చిత్రపటం ఏర్పాటు చేసి కాంగ్రెస్ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో నాయకులు సయ్యద్ అబిదా, విజయ్‌చంద్ర తదితరులు పాల్గొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి, ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వి. రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

యూజర్ చార్జీల రద్దు కోరుతూ లేఖ

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ పరిధిలో చెత్తపై యూజర్ చార్జీలు వెంటనే రద్దు చేయాలని సీపీఎం ఫ్లోర్ లీడర్, 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి. గంగారావు నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి లేఖ పంపారు. ప్రతి ఇంటికి నెలకు రూ.120, మురికివాడల్లో రూ.60 చొప్పున యూజర్ చార్జీలు నిర్ణయించారని, ఈ చార్జీలను సీపీఎం కార్పొరేటర్‌గా తీవ్రంగా వ్యతిరేకించిన విషయం తెలిసిందేనన్నారు. ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుందన్నారు. తక్షణం కౌన్సిల్ సమావేశం నిర్వహించి చెత్తపై యూజర్ చార్జీలు రద్దు చేస్తూ తీర్మానం చేయాలని సీపీఎం డిమాండ్ చేస్తుందన్నారు.

నోరూరిస్తున్న సీజనల్ ఫ్రూట్స్

మద్దిలపాలెం : నగరంలో సీజనల్ ఫ్రూట్స్ విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. కలర్ ఫుల్‌గా కనిపిస్తూ పండ్ల ప్రియులకు నోరూరిస్తున్నాయి. లిచీ ఫ్రూట్, గులాబ్ జామ్ ఫ్రూట్ ఫ్రెష్‌గా తోపుడు బండ్ల, ప్రత్యేక స్టాళ్లలో కనువిందు చేస్తున్నాయి. వీటితో పాటు పల్లెలకు పరిమితమయ్యే ఈత పండ్లు తాజాగా నగరం కూడళ్ల వద్ద దర్శనమిస్తున్నాయి.

ఈత పండ్లకు పట్టణంలో డిమాండ్

ఈత పండ్లను కుప్పలుగా పోసి డొక్కుల లెక్కన రైతులు విక్రయిస్తున్నారు. ఈ పండ్ల రుచికి నగర వాసులు ఫిదా అవుతున్నారు. డొక్కు రూ.100 నుంచి రూ.130 చొప్పున ధర ఉన్నా ఏ మాత్రం లెక్కచేయకుండా ఎంచక్కా కొనుక్కొంటున్నారు. సుదూర ప్రాంతాలైన పలాస, శ్రీకాకుళం, ఆముదాలవలస నుంచి రైతులు, వ్యాపారులు ఈ పండ్లను నగరానికి తీసుకొస్తున్నారు. వీటి విక్రయాలు ఆశాజనంగా ఉండడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

• సీజనల్ ఫ్రూట్ లిచీ, గులాబ్ జామ్ ఫ్రూట్‌కు మంచి గిరాకీ ఉంది. లిచీ ఫ్రూట్ కోల్‌కతా నుంచి నగరానికి దిగుమతి అవుతుంది. ఈ లిచీ ఫ్రూట్ కేవలం మే, జూన్ మాసాల్లోనే లభిస్తుంది.



మద్దిలపాలెంలో ఈత పండ్ల విక్రయాలు

గులాబ్ జామ్ ఫ్రూట్ సైతం ఈ రెండు నెలలు మాత్రమే మార్కెట్‌లో దర్శనమిస్తుంది. దీంతో పండ్ల ప్రియులు వాటి రుచిని ఆస్వాదిస్తున్నారు. లిచీ కిలో ధర రూ.300– నుంచి రూ.320 ఉంది. గులాబ్ జామ్ ఫ్రూట్ ధర కిలో రూ.200 ఉంది. ధర అధికంగా ఉన్నా సీజనల్ పండ్ల విక్రయాలు బాగానే ఉన్నాయి.



మార్కెట్‌లో లిచీ ఫ్రూట్స్, గులాబ్‌జామ్ పండ్లు

చురుగ్గా డెయిరీ ఫారం బస్‌బే నిర్మాణం



జాతీయ రహదారి పక్కన ఇందిరానగర్ వద్ద నిర్మాణంలో ఉన్న బస్‌బే

ఆరిలోవ: నగరంలో జీవీఎంసీ అధికారులు కొన్నాళ్లగా బస్‌బేలు నిర్మిస్తున్నారు. ఇప్పటికే పలు చోట్ల బస్‌బేలు అందుబాటులోకి వచ్చాయి. ప్రయాణికులకు సౌకర్యవంతంగా అత్యాధునికంగా నిర్మాణం చేపడుతున్నారు. ఇందులో భాగంగా జాతీయ రహదారి పక్కన పాత డెయిరీ ఫారంలో ఇందిరా నగర్ వద్ద తలపెట్టిన బస్‌బే నిర్మాణం చురుగ్గా సాగుతోంది. ఇంత వరకు ఇక్కడ బస్ షెల్టర్ లేక పోవడంతో ప్రయాణికులు ఇబ్బందిపడేవారు. ప్రస్తుతం చేపడుతున్న బస్‌బేతో ప్రయాణికుల సమస్య తీరనుంది. ఈ బస్‌బే అందుబాటులోకి వస్తే ఇందిరానగర్ వాసులతో పాటు రూరల్ తహసీల్దారు కార్యాలయం, జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లే వారికి ఉపయోగపడుతుంది. అంతే కాకుండా శ్రీకాకుళం, విజయనగరం వైపు వెళ్లే సర్వీసు బస్సుల కోసం ఎదురుచూసే ప్రయాణికులకు కూడా ఉపయోగకరంగా ఉండనుంది. కొద్ది రోజుల్లో ఈ బస్ బే అందుబాటులోకి రానుంది.

నేతాజీనగర్‌లో అన్నసమారాధన

ఆరిలోవ: జీవీఎంసీ 12వ వార్డు నేతాజీనగర్‌లో పోలమాంబ అమ్మవారి నెల పండగ మంగళవారం ఘనంగా జరిగింది. స్థానిక భక్తులు వేకువజాము నుంచి అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఇందులో భాగంగా అమ్మవారికి కుంకుమ అర్చనలు, అభిషేకాలు చేశారు. ఈ సందర్భంగా విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ నిర్వాహకులు ఆయన పేరిట ప్రత్యేక పూజలు చేయించారు. అనంతరం ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో ఎంవీవీ పాల్గొని భక్తులకు భోజనాలు వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు చొక్కర శేఖర్, తదితరులు పాల్గొన్నారు.



నేతాజీనగర్ పోలమాంబ ఆలయ ప్రాంగణంలో భక్తులకు భోజనాలు వడ్డిస్తున్న ఎంపీ ఎంవీవీ

చిన పోలమాంబ జాతర సందడి

మద్దిలపాలెం : శివాజీపాలెంలో చిన పోలమాంబ అమ్మవారి వార్షిక జాతర మంగళవారం సందడిగా జరిగింది. అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు వేకువజాము నుంచి ఆలయం వద్ద బారులు తీరారు. మహిళలు అమ్మవారి పసుపు, కుంకుమ, గాజులు సమర్పించారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా శ్రీకృష్ణా సేవా సంఘం ప్రతినిధులు పక్కాగా ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయం వద్ద సాముగరిడీలు, కోలాటం, పులివేషాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పోలమాంబకు ప్రత్యేక పూజలు

ఏయూ క్యాంపస్: స్థానిక శివాజీపాలెంలోని చినపోలమాంబ అమ్మవారి పండగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా అమ్మవారిని కార్పొరేటర్ మువ్వల లక్ష్మి దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో మువ్వల సురేష్, తదితరులు పాల్గొన్నారు.



అమ్మవారిని దర్శించుకుంటున్న కార్పొరేటర్ మువ్వల లక్ష్మి



జాతరలో సాంస్కృతిక ప్రదర్శనలు



ఆలయం వద్ద సాముగరిడీ సందడి

ఘనంగా అమ్మవార్ల ఉత్సవాలు

బంగారమ్మ, పోలమాంబకు మొక్కులు చెల్లించుకున్న భక్తులు

దాబాగార్డెన్స్ : జీవీఎంసీ 28వ వార్డులో వెలసిన బంగారమ్మ, పోలమాంబ, 31వ వార్డు కృష్ణాగార్డెన్స్‌లో వెలసిన దుర్గాలమ్మ ఉత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉత్సవాల్లో భాగంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు.

బంగారమ్మ పండగ..

ఈ నెల 19న ప్రారంభమైన పిఠానిదిబ్బలో వెలసిన బంగారమ్మ జాతర మహోత్సవాలు మంగళవారం అనుపు మహోత్సవంతో ముగిసాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పండగ చాటింపు, సోమవారం తొలేళ్ల ఉత్సవం, 21న ప్రధాన పండగ అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉత్సవాల్లో గరిడీలు, పులివేషాలు, తప్పిటగుళ్ల వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. పిఠానిదిబ్బ, గొల్లలపాలెం, ప్రకాశరావుపేట, దిబ్బలపాలెం, భానోజీనగర్, కన్నయ్యపేట, విశ్వనాథం రోడ్డు, సింగ్ హోటల్ జంక్షన్ తదితర ప్రాంతాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పోలమాంబ పండగ..

గొల్లలపాలెం గ్రామ ప్రజల ఆరాధ్యదైవం పోలమాంబ జాతర మహోత్సవాలు అత్యంత ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం చాటింపు జరిపారు. సోమవారం తొలేళ్ల ఉత్సవం, మంగళవారం అనుపు కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. గొల్లలపాలెం, శెట్టిబలిజ సంఘం, బుద్ధలవానిపాలెం, రామ్‌నగర్, నెహ్రూనగర్, ఆది ఆంధ్ర గ్రామం, అశోక్‌నగర్, మున్సిపల్ కార్పొరేషన్ ప్రాంత వాసులు పోలమాంబను ఆరాధిస్తుంటారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అమ్మవారిని సదునుపట్టు (ఆర్టీ క్లబ్ గొల్లలపాలెం) నుంచి ధూప దీప నైవేద్యాలు, బాజా భజంత్రీలు, తప్పిటగుళ్లు, చెక్కభజన, పులివేషాలు, సాము గరిడీలతో భారీ ఊరేగింపు నిర్వహించారు. 28న మారువారం జరపనున్నారు. ఉత్సవంలో భాగంగా వచ్చే నెల 9న ఆలయ ప్రాంగణం వద్ద పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నట్టు పోలమాంబ అమ్మవారి ఆలయ కమిటీ ప్రతినిధులు తెలిపారు.



పిఠానిదిబ్బలో వెలసిన బంగారమ్మ



గొల్లలపాలెం గ్రామదేవత పోలమాంబ

బంగారమ్మ సన్నిధిలో ఎంపీ ఎంవీవీ

బీచ్ రోడ్డు: జీవీఎంసీ 28వ వార్డు పిఠానిదిబ్బ గ్రామ దేవత బంగారమ్మ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. విశాఖ ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ పల్లా అప్పలకొండ, వైఎస్సార్‌సీపీ వార్డు ఇన్‌చార్జి పల్లా దుర్గారావు, ఈగల త్రినాథరావు, తోటపల్లి శ్రీను, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.



బంగారమ్మ సన్నిధిలో పూజలు చేస్తున్న ఎంవీవీ



పోలమాంబకు ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీ ఎంవీవీ

జీవీఎంసీ 22వ వార్డు పీతలవానిపాలెం, శివాజీపాలెం గ్రామ దేవత పోలమాంబ అమ్మవారి జాతర మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గం అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, మత్స్యకార నాయకుడు గంపల వెంకట రామచంద్రరావు, చొక్కార శేఖర్‌రావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని యువకుడి ఆత్మహత్య



యువకుడి మృతదేహం

గోపాలపట్నం: మర్రిపాలెం రైల్వేస్టేషన్ పరిధిలో గుర్తు తెలియని యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎయిర్‌పోర్టు పోలీసులు తెలిపిన వివరాలివీ.. మర్రిపాలెం రైల్వే స్టేషన్‌కు వెళ్లే రోడ్డులో ఓ టిఫిన్ దుకాణం ఉంది. అక్కడ రేకుల షెడ్డు సమీపంలో గుర్తు తెలియని వ్యక్తి కేబుల్ వైర్‌తో ఉరి వేసుకున్నాడు. మంగళవారం ఉదయం స్థానికులు మృతదేహాన్ని గుర్తించి ఎయిర్‌పోర్టు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకుని ఆధారాలు సేకరించారు. మృతుడి వయసు 30 ఏళ్లు ఉంటుందని అంచనా వేశారు. అతను పసుపు రంగు ప్యాంట్ ధరించి ఉన్నాడు. కుటుంబ సభ్యులెవరైనా మృతదేహాన్ని గుర్తించినట్లయితే తమకు సమాచారం ఇవ్వాలని ఎయిర్‌పోర్టు సీఐ చక్రధరరావు సూచించారు. మృతదేహాన్ని కేజీహెచ్‌కు తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

మద్దిలపాలెంలో భూలోకమాత వార్షికోత్సవం

మద్దిలపాలెం : జీవీఎంసీ 23వ వార్డు మద్దిలపాలెం జాతీయ రహదారిపై పెట్రోల్ బంకు వద్ద ఉన్న భూలోమాత అమ్మవారి వార్షికోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో తెల్లవారుజాము నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. చీర, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం సాముగరడీలు, నేల వేషాలు, కర్రసాము వంటి సంప్రదాయ నృత్యాలతో సంబరాలు అంబరాన్నంటాయి.



మద్దిలపాలెంలో భూలోకమాత

ఎక్కడ చూసినా ధనస్వామ్యమే..

ఆదికవి నన్నయ్య వర్సిటీ మాజీ వీసీ ముత్యాలనాయుడు

దాబాగార్డెన్స్: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఎక్కడా కనిపించలేదని, ఎక్కడ చూసినా ధనస్వామ్యమేనని ఆదికవి నన్నయ్య యూనివర్సిటీ మాజీ వీసీ ప్రొఫెసర్ ముర్రు ముత్యాలనాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. కట్టడి చేయాల్సిన వారే డబ్బులు పంపిణీ చేసి ఓటర్లకు గాలం వేయడం దారుణమన్నారు. దేశంలో ఎంతో సాధించామనే చెప్పే ప్రధాని మోదీ.. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఇంత జరుగుతున్న చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేంటని ప్రశ్నించారు. ఈ విషయానికి సంబంధించి మోదీకి పంపిన లేఖను మంగళవారం వీజేఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో మీడియాకు విడుదల చేశారు. ఇటీవల కాలంలో ఓటర్లకు ప్రత్యక్ష డబ్బు బదిలీలు బాగా పెరగడంతో ప్రజాస్వామ్యం తుప్పు పట్టిందన్నారు. ప్రధాన రాజకీయ పార్టీ అభ్యర్థులు ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్‌కు సగటున రూ.50 కోట్లు ఖర్చు చేశారని, ప్రతి ఓటరుకు సగటున రూ.1, 500 నగదు ఇచ్చారని ఆరోపించారు. ఒక్క రాష్ట్రంలోనే సుమారు 3 కోట్ల మంది ఓటర్లకు ఇలా నగదు అందజేశారని, దీన్ని బట్టి దేశంలో ఏ మేరకు నగదు పంపిణీ చేశారో అర్థం చేసుకోవచ్చన్నారు. ఎన్నికల్లో సంస్కరణలు తీసుకురావాలని మోదీకి పంపిన లేఖలో విజ్ఞప్తి చేశారు.



ప్రధానికి పంపిన లేఖ చూపిస్తున్న ప్రొఫెసర్ ముత్యాలనాయుడు

జీతాలు చెల్లించకపోవడం ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమే

అగనంపూడి: తొమ్మిది వందల కోట్ల రూపాయల అడ్వాన్స్ రూపేణా ఉక్కు యాజమాన్యం సేకరించినా నేటికి ఉక్కు ఉద్యోగులు జీతాలు చెల్లించకపోవడం, ప్రైవేటీకరణ ఎత్తుగడలో భాగమేనని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వరసాల శ్రీనివాసరావు పేర్కొన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను నిరసిస్తూ కూర్మన్నపాలెం కూడలి వద్ద ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. 1,195 రోజులుగా ఆందోళన చేస్తున్నా, యాజమాన్యంలోగాని, ప్రభుత్వాల్లోగాని కనీసం స్పందన లేకపోవడం, కావాలని కార్మికుల జీతాలు చెల్లించకుండా తాత్సారం చేస్తుండడం అన్యాయమన్నారు. అఖిలపక్ష కార్మిక సంఘాల పిలుపు మేరకు ఉక్కులోని డెడికేషన్ పార్కు వద్ద బుధవారం ఉదయం పది గంటలకు వేలాది మంది కార్మికులు పాల్గొని నిరసన తెలపేందుకు నిర్ణయించామని, ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున కార్మికులు, కాంట్రాక్ట్ కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. బీజేపీ పాలనలో నియమితులైన ఉక్కు సీఎండీలు, డైరెక్టర్లు వివాదస్పదంగా వ్యవహరిస్తూ అనవసర ఖర్చులు తగ్గించకుండా యథేచ్ఛగా షికార్లు చేస్తున్నారని, ఈవిషయంలో ఉక్కు మంత్రిత్వశాఖ చోద్యం చూస్తోందని ఆరోపించారు. ఈవ్యవహారాలపై సీబీఐ, విజిలెన్స్ అధికారులు దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, మధు, పీఆర్‌కే రాజు, గుమ్మడి నరేంద్ర శ్రీనివాసనాయుడు, దాసరి శ్రీనివాస్, టక్కు సత్యనారాయణ పాల్గొన్నారు.



కార్మికులనుద్దేశించి మాట్లాడుతున్న వరసాల శ్రీనివాసరావు

గంజాయితో ఇద్దరి అరెస్ట్

గోపాలపట్నం: గంజాయి తరలిస్తున్న ఇద్దరు యువకులను టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకుని గోపాలపట్నం పోలీసులకు అప్పగించారు. పోలీసులు తెలిపిన వివరాలు.. ముందస్తుగా వచ్చిన సమాచారం మేరకు మాటు వేసి నిందితులను పట్టుకుని వారి నుంచి 11 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. వీరు కేరళ రాష్ట్రానికి చెందిన వారుగా గుర్తించారు. తీరువెల్ల థామస్(27), చారోన్(24) అరుకులో గంజాయి కొనుగోలు చేసి కేరళ తీసుకు వెళ్లేందుకు యత్నిస్తుండగా రైల్వే స్టేషన్ దగ్గరలో పట్టుకున్నారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

సుర్రుమన్న సూరీడు



జనసంచారం లేని అల్లిపురం మెయిన్‌రోడ్డు

అల్లిపురం : వేసవి తాపంతో వాహన చోదకులు, పాదచారులు అవస్థలు పడుతున్నారు. ఇంటి నుంచి బయటికి వస్తే చాలు సూరీడు సుర్రుమంటున్నాడు. మంగళవారం ఎండ తీవ్రతకు తాళలేక ప్రజలు గొడుగులు, టోపీలను ఆశ్రయించారు. అత్యవసరమై ఇంటి నుంచి బయటికి వచ్చేవారు తగిన జాగ్రత్తలు తీసుకుని వస్తున్నారు. ఎండ వేడిమికి తట్టుకోలేక కొబ్బరి బొండాలు, శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. దీంతో కూల్‌డ్రింక్స్, పళ్ల రసాలు అమ్మే దుకాణాలు కిటకిటలాడుతున్నాయి. మరొక నాలుగు రోజుల్లో రోహిణికార్తె ప్రారంభం కానుంది. అప్పుడు పరిస్థితి ఏమిటని నగరవాసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



శీతల పానీయాల బండి వద్ద గుమిగూడిన వాహన చోదకులు



ఎండ వేడి తట్టుకోలేక గొడుగును ఆశ్రయించిన వ్యక్తి

వైభవంగా అప్పన్న నిత్యకల్యాణం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలలో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.



యజ్ఞోపవీతధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు